క్లుప్తంగా

నడిగూడెం తహసీల్దార్‌గా హేమామాలిని


బాధ్యతలు స్వీకరిస్తున్న హేమామాలిని

నడిగూడెం : నడిగూడెం తహసీల్దార్‌గా హేమామాలిని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న టి.నాగేశ్వరరావు సూర్యాపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

నేడు సర్వసభ్య సమావేశం

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య శుక్రవారం విలేకరులకు తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

9న గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కన్నంతరెడ్డి వనజ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర సభ్యుడిగా చంద్రశేఖర్


చంద్రశేఖర్

చిలుకూరు : అభ్యుదయ రచయితల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చిలుకూరు గ్రామానికి చెందిన రచయిత గండెల చంద్రశేఖర్‌ను నియమించినట్లు ఆయన శుక్రవారం చిలుకూరులో విలేకరులకు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 3వ తేదీ వరకు జరిగిన అభ్యుదయ రచయితల సంఘం 3వ రాష్ట్ర మహాసభల్లో తనను ఎంపిక చేసినట్లు తెలిపారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

మఠంపల్లి : ప్రభుత్వం 20 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మాళోతు చందర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో పీడీఎస్‌యూ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 13 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ సాక్షాత్తు అసెంబ్లీలోనే ప్రకటించి ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్‌లు సక్రమంగా వేయాలన్నారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఉదయ్, భాను, ప్రవీణ్, చరణ్, సాయి, సన్నీ, చందు, గోపి, కార్తీక్ తదితరులు ఉన్నారు.

బూరుగడ్డకు గర్వకారణం


కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులను సన్మానిస్తున్న సర్పంచ్ షేక్ సలీమా

హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన 11 మంది విద్యార్థులు పోలీస్ కానిస్టేబుళ్లుగా ఒకేసారి ఉద్యోగం సాధించడం తమ గ్రామానికి ఎంతో గర్వకారణమని సర్పంచ్ షేక్ సలీమారంజాన్ అన్నారు. శుక్రవారం గ్రామంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులను ఆమె ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, బీఆర్ఎస్ నాయకుడు షేక్ అలీపాషా, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగలింగం, కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులు వేణుకుమార్, యరగాని సాయికుమార్, అశోక్, మహేష్, శ్రీహరి, శివశంకర్, వేణు, గోపి, లక్ష్మీనారాయణ, నాగేంద్రబాబు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

నడిగూడెం : అక్టోబర్ 1వ తేదీ వరకు 18 సంవత్సరాల వయస్సు నిండిన యువత ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ టి.నాగేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఓటు నమోదుకు మరో 10 రోజులు అవకాశం ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నేరేడుచర్ల : మండలంలోని బక్కయ్యగూడెం గ్రామంలో సీసీ రోడ్డు వేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఎమ్మెల్యే సైదిరెడ్డి చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ నర్సయ్య నాయకులు అరవింద్, వెంకటేశ్వర్లు, రామయ్య, భద్రయ్య, సోమయ్య, సంపత్ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పాలకవీడు : మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు శనివారం ఎమ్మెల్యే సైదిరెడ్డి హాజరవుతారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాన్‌పహాడ్ దర్గా అభివృద్ధి పనులు, రావిపహాడ్, దేవ్లాతండా గ్రామపంచాయతీ నూతన భవనాల ప్రారంభోత్సవం, గుండెబోయినగూడెం, మూసీఒడ్డుసింగారం నుంచి రోళ్లవారిగూడెం బీటీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గుంతలమయంగా రహదారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మొరపెట్టుకున్నా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


గుంతలమయంగా గణపవరం స్టేజీ నుంచి ఊర్లోకి వెళ్లే రోడ్డు


బీక్యాతండా రోడ్డు ఇలా..

కోదాడరూరల్ : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన బీటీ రహదారులు గుంతలమయంగా మారాయి. రోడ్లు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందికరంగా తయారయ్యాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పరిస్థితి గురించి ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని గణపవరం స్టేజీ నుంచి గణపవరం గ్రామంలోకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. అదేవిధంగా స్టేజీ నుంచి బీక్యాతండా వరకు ఉన్న రోడ్డు పలు చోట్ల ధ్వంసమైంది. తొగర్రాయి గ్రామంలోకి వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగా ఉంది. అయితే రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రోడ్లు వేసిన మూడు నాలుగు సంవత్సరాలకే ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తమ గ్రామాలకు వెళ్లే రోడ్లను నూతన బీటీ కాని లేదా మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కోదాడ – మేళ్లచెర్వు ప్రధాన రహదారి నుంచి గణపవరం వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. నూతన బీటీ రోడ్డు వేయించాలని అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశాం కానీ వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– ఇర్ల సీతారాంరెడ్డి, గణపవరం

గుంతలు పూడ్చాలి



గణపవరం స్టేజీ నుంచి బీక్యాతండా, రామలక్ష్మీపురం గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చాలి.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మీపురం

నిధులు మంజూరు అయ్యాయి



గణపవరం స్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు పనులకు రూ.17లక్షలు, బీక్యాతండా రోడ్డు నిర్మాణానికి రూ.96 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. వారం రోజుల్లో పనులు ప్రారంభం అవుతాయి.

– జవ్వాజీ రాము, పీఆర్ ఏఈ, కోదాడ

ఉత్తమ్‌కు పదవులు తప్ప అభివృద్ధి పట్టదు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


హుజూర్‌నగర్ : పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి


నేరేడుచర్ల : 4వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : కృష్ణపట్టి బిడ్డగా ఈ ప్రాంత కష్టాలు తనకు మాత్రమే తెలుసని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెంలో జరిగిన బూత్ కమిటీల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కృష్ణపట్టి బిడ్డగా ఆ ప్రాంత కష్టాలు తీర్చడానికి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. అందుకనే సాగునీటి కోసం ఏడున్నర కోట్లు పెట్టి లిఫ్టులకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఉత్తమ్‌కు భార్యాభర్తలకు ఇద్దరికి పదవులు కావాలి తప్ప అభివృద్ధి పట్టదని, నియోజకవర్గ ప్రజలకు వారు ఏ పని చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. రెండు రోజుల్లో చింతలపాలెం మండలానికి రూ.40 లక్షలతో షాదీఖానా మంజూరు చేయిస్తున్నానని, ఎలక్షన్ కోడ్ వచ్చినా దాని నిర్మాణం ఆగదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ చంద్రకళ సైదిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, ఎం.సత్యనారాయణరెడ్డి, అమీర్ సాబ్, సైదిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

హుజూర్‌నగర్‌లోని 24వ వార్డులో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా ఆటో నడిపి ఆటో ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు క్యాంప్ కార్యాలయంలో మేళ్లచెరువుకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

నేరేడుచర్ల : మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మిర్యాలగూడ రోడ్డులో గల ఈద్గాకు గతంలో ప్రభుత్వం కేటాయించిన 10 కుంటల భూమికి గాను మసీదు కమిటీకి పట్టా అందజేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన మరో 35 కుంటల స్థలానికి మంజూరు పత్రం అందజేశారు. మిర్యాలగూడ రోడ్డులోని ఈద్గా స్థలంలో షాదీఖానా నిర్మాణానికి రూ.50 లక్షలు, మసీదు అభివృద్ధికి రూ.5లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల విధి నిర్వాహణలో గుండెపోటుతో మృతి చెందిన కానిస్టేబుల్ నాగరాజు కుటుంబాన్ని పరామర్శించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, కౌన్సిలర్లు అలక సరిత సైదిరెడ్డి, ఎస్కె బాషా, తాళ్లూరి సాయిరాం, ఎస్కె షాహనాజ్, బాణోతు లలిత, వేమూరి నాగవేణి, బీఆర్ఎస్ పట్టణ ఎన్నికల ఇన్‌చార్జ్ సత్యనారాయణరెడ్డి, మన్సూర్ అలీ, వీరయ్య, సైదిరెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, మోలానాసాబ్, అసన్‌సాబ్, ఖాదర్‌పాషా, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం

హుజూర్‌నగర్ : విద్యార్థుల కోసం అద్భుతమైన పథకం తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి అల్పాహారం ఆరగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ సైదానాయక్, హెచ్ఎం జయవాణి, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి– రజిత దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో వర్రా వెంకటరెడ్డి, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : ప్రభుత్వం అమలు చేసే అల్పాహార పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో గల పాఠశాలలో ఆయన అల్పాహార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి.సలీమ్‌షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


కోదాడ : సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : కాంగ్రెస్ పార్టీతోనే కోదాడ పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డులో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లంకెల రమాదేవి నాయకులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కందుల కోటేశ్వరరావు, వంగవేటి రామారావు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మునగాల : మండలంలోని నేలమర్రిలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నలబోలు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పద్మావతిరెడ్డి బత్తిని వెంకన్నగౌడ్, చిట్యాల నాగరాజు, బత్తిని లింగస్వామిగౌడ్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడిపూడి కృష్ణ, చిట్యాల వేణు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలి

నడిగూడెం : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి కోరారు. శుక్రవారం మండలంలోని వల్లాపురంలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం సిరిపురం, నారాయణపురం, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, కోదాడ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు, మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌కు కోర్టు మంజూరుపై హర్షం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరుపై న్యాయవాదులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, అధికార ప్రతినిధులు సాముల రామిరెడ్డి, కాల్వ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం హుజూర్‌నగర్‌లో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 8 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఒక న్యాయమూర్తే వాటిని విచారిస్తుండటంతో తీవ్ర ఆలస్యం జరగడమే కాకుండా న్యాయమూర్తిపై ఒత్తిడి పడుతోందని అన్నారు. ఈ విషయమై బార్ అసోసియేషన్ తరపున న్యాయవాదులు అనేకమార్లు హుజూర్‌నగర్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేయమని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీంతో పాటు హై కోర్టుకు సిఫారసు చేయటంతో ప్రభుత్వం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

కోదాడ కోర్టులో సంబరాలు

కోదాడ : కోదాడకు ప్రభుత్వం మరో రెండు కోర్టులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కోర్టు ఆవరణలో న్యాయవాదులు స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ప్రస్తుతం కోదాడలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఉన్నాయి. అదనంగా సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరయ్యాయి. వీటిని త్వరలో ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కోదాడకు రెండు కోర్టులు మంజూరు చేయడం పట్ల కోదాడ బార్ అసోసియేషన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

పీఆర్సీ అమలు చేయాలి

హుజూర్‌నగర్ : గురుకులాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి పీఆర్సీని అమలు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అజీజ్ పాషా కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారికి పీఆర్సీ, ఏరియల్స్ మొత్తాన్ని వెంటనే ఇవ్వాలని సీఎం కేసీఆర్, జిల్లా కలెక్టర్‌లకు బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

ఆడపడుచులకు అండగా సీఎం కేసీఆర్


నేరేడుచర్ల : బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు


కోదాడరూరల్ : రెడ్లకుంటలో బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడుతున్న ఎంపీపీ కవితారెడ్డి

కోదాడరూరల్ : సీఎం కేసీఆర్ ఆడపడుచులకు అండగా నిలుస్తున్నారని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దోరకుంట, నల్లబండగూడెం, రెడ్లకుంట, కూచిపూడి, కాపుగల్లు గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి, బతుకమ్మ చీరల పంపిణీ

గరిడేపల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మహిళలకు బతుకమ్మ చీరలను ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజ, సర్పంచ్ త్రిపురం సీతారాంరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్కె సైదాబీ రాజ్ మహ్మద్, వార్డు సభ్యులు రాంరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సురేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, వీఓఏ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని మహిళలకు మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు శుక్రవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, కౌన్సిలర్లు షాహనాజ్, తాళ్లూరి సాయిరాం, బాణోతు లలిత, మేనేజర్ ఆశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దళితబంధు.. అర్హులకే ఇవ్వాలని వినతి


హుజూర్‌నగర్ : ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు


కోదాడరూరల్ : ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న తొగర్రాయి గ్రామస్తులు

హుజూర్‌నగర్ : అనర్హులకు ఇచ్చిన దళితబంధు రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండవ వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండలంలోని తాళ్ల మల్కాపురం దళితులతో కలిసి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. అధికార పార్టీ నాయకుల అనుచరులకు, బినామీలకు దళితబంధు ఇస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆర్‌డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో దళితులు సాలయ్య, వెంకటేశ్వర్లు, ఈదయ్య, రాములు, రాంబాబు, రామకృష్ణ, సుధాకర్, మహేష్, అంజయ్య, సైదులు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో అనర్హులకు దళితబంధు ఇస్తున్నారని ఆ గ్రామ దళితులు శుక్రవారం కోదాడలోని ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి అనంతరం వినపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలైన దళితులకు దళితబంధు ఇవ్వకుండా భూములు, ఆస్తులు ఉన్న వారికి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు వారికి నచ్చినవారికి దళితబంధు వచ్చేలా పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్డీఓ స్పందించి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో నేలమర్రి శ్రీను, మంద నరేందర్, దాసరి నాగేంద్రబాబు, క్రాంతి, కిషోర్, శ్రీకాంత్, శంభయ్య, సత్తయ్య, వినోద్, దావీద్, మహిళలు ఉన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


నడిగూడెం నుంచి బరాఖత్‌గూడెంకు వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా గుంత

నడిగూడెం : మండల కేంద్రం నుంచి మునగాల మండలం బరాఖత్‌గూడెంకు వెళ్లే రహదారిలో సాగర్ కాలువ సమీపాన రోడ్డు మధ్యలో లోతైన గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి మీదుగా నిత్యం వందల మంది ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కావున అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు


నేరేడుచర్ల : కేక్ కట్ చేస్తున్న గోపాలమిత్రలు

కోదాడ : మండల పరిధిలోని కూచిపూడిలో కోదాడ క్లస్టర్ గోపాలమిత్రల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, జి.ఉపేందర్, రామకృష్ణ, రవీందర్, నాంచారయ్య, అజయ్, అబ్దుల్, రామకృష్ణ గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలో కోదాడ క్లస్టర్ పరిధి గోపాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : నేరేడుచర్లలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను శుక్రవారం గోపాల మిత్రలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు పంచిపెట్టారు. మెరుగు రామయ్య, కర్నాటి వీరారెడ్డి, మోదాల బాలస్వామి, సైదులు, భుజంగరావు, లొడంగి సాయి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల రాస్తారోకో


నేరేడుచర్ల : జడ్చర్ల- కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు



కోదాడ : రాస్తారోకో చేస్తున్న ఆశా వర్కర్లు

నేరేడుచర్ల : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శుక్రవారం జడ్చర్ల- కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి మాట్లాడుతూ గత 12 రోజులుగా ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దూళిపాల ధనుంజయ నాయుడు, నర్సింహ, పాతూరి శ్రీనివాస్‌రావు, చిలక రాజు, శ్రీను, సైదులు, వెంకన్న, అశా వర్కర్లు జి.తులసి, రాజ్యం, మంజుల, స్వప్న, జ్యోతి, ధనలక్ష్మి, స్వర్ణలత తదితరులు ఉన్నారు.

వేతనాలు పెంచేవరకు సమ్మె చేస్తాం

కోదాడ : తమ వేతనాలు పెంచేవరకు సమ్మె కొనసాగిస్తామని ఆశా వర్కర్లు స్పష్టం చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కోదాడలో ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించి రంగా థియేటర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాధాకృష్ణ, ముత్యాలు ఆశా వర్కర్లు సుశీలవాణి, ముత్యాలవాణి, నాగమణి, లింగమ్మ, పద్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్కె యాకుబ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, కడియాల అప్పయ్య, నబిసాయబ్ తదితరులు ఉన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించేవరకు సమ్మె


హుజూర్‌నగర్ : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

హుజూర్‌నగర్ : మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు పెంచిన వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించేవరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు. మంగమ్మ, లక్ష్మి, సావిత్రి, సరిత, సామ్రాజ్యం, సూరమ్మ, సత్యవతి, నాగమణి, లక్ష్మి, పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

మునగాల : తమ సమస్యలు పరిష్కరించాలని గత వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం మాట్లాడుతూ కార్మికులకు సీఎం కేసీఆర్ గౌరవ వేతనం ప్రకటించిన నాటి నుంచి ఏరియర్స్‌తో సహా కలిపి వేతనాలు చెల్లించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు ధనమ్మ, నాగమ్మ, లింగమ్మ, జి.సైదమ్మ, సరోజన, స్వప్న, ప్రమీల, రంగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 9వ రోజు కొనసాగింది. సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రన్‌మియా, శాంతాకుమారి, ధనమ్మ, లచ్చిరాం, గోవిందమ్మ, సాలమ్మ, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 9వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు మాట్లాడుతూ కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలని కోరారు. దానయ్య, ప్రమీల, సైదమ్మ, లక్ష్మి, పద్మకుమారి పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన


కలకోవలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుజాత

మునగాల : మండల కేంద్రంలోని పలు వార్డుల్లో శుక్రవారం సర్పంచ్ చింతకాయల ఉపేందర్, ఉప సర్పంచ్ ఎల్. వెంకయ్య, ఎంపీటీసీలు కాసర్ల కల్పన, ఉప్పుల రజితలు డ్రెయినేజీ నిర్మాణం, సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కలకోవలో ఎంపీటీసీ నిధులు రూ.2 లక్షలు, పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను సర్పంచ్ కొంపెల్లి సుజాత, ఎంపీటీసీ గన్నా భవాని, ఉపసర్పంచ్ బెల్లంకొండ చినవెంకన్నలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బతుకమ్మ చీరలు, యువతకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యదర్శులు శ్వేత, దొంగరి సైదులు, వార్డు సభ్యులు మహేశ్వరి, వీరబాబు, శ్రీనివాసరావు, నిర్మల, కోఆప్షన్ సభ్యులు వీరయ్య, చిన సైదులు, వెంకటమ్మ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వీరభద్రం, వీరబాబు, నరసింహారావు పాల్గొన్నారు.